ముఖారి - ఆది

బ్రహ్మకడిగిన - పాదము
బ్రహ్మము తానేనీ - పాదము

చెలగి వసుధ కొలి - చిననీపాదము
బలి తల మోపిన - పాదము
తలకకగగనము - తన్నిన పాదము
బలరిపు గాచిన - పాదము

కామిని పాపము - కడిగిన పాదము
పాముతల నిడిన - పాదము
ప్రేమపు శ్రీసతి - పిసికెడి పాదము
పామిడి తురగపు - పాదము

పరమ యోగులకు - పరి పరి విధముల
వరమొసగెడి నీ - పాదము
తిరువేంకటగిరి - తిరమని జూపిన
పరమపదము నీ - పాదము

అది వామనావతార విజృంభణ వేళ. మూడడుగుల భూదానాన్ని మూడు అడుగులుగా భూమినీ, సమస్తాశాంతరాళాన్నీ ఆక్రమించుకొంటూ పెరుగుతున్న విష్ణు పాదం సత్యలోకాన్ని చేరి, మించి, దాటిపోయే సమయంలో బ్రహ్మ విష్ణుపాదానికి అభిషేకమొనరించాడు. బ్రహ్మగడిగిన నీ ఆ పాదమే పర బ్రహ్మము, అని స్వామి పాద సంకీర్తనం చేశారు అన్నమాచార్యులు. తిరుమల వెళ్ళే బాటలో మొదటి మెట్టును అడిపిడి అంటారు. అక్కడ స్వామి పాదాలు ఉన్నవి.

భూమినంతా తానై కొలచిన నీ పాదము (అదే పరబ్రహ్మము) భూమి ప్రమాణం నీ పాదమని భావం. బలి తలపై మోపిన ఆ పాదమే పరబ్రహ్మము. సువిశాల గగనవైశాల్యాన్నీ, ఔన్నత్యాన్నీ లెక్కగొనక తన్నినది (ఆక్రమించినది) ఈ పాదము బలరిపుడైన యింద్రుని సంరక్షింప నవతరించిన శ్రీ వామను పాదమే ఇది.

కామినియైన అహల్య (కాముకయైనది కామిని) కామపు దోషాన్ని తన స్పర్శమాత్రంచే తొలగించిన శ్రీరామ శ్రీపాదమే ఇది. మడుగులోని పొగరుబోతు పాములరాజు కాళీయుని తలపై నృత్యమాడిన శ్రీకృష్ణుని ముద్దు పాదమే ఇది. ప్రేమ ముప్పిరిగొనగా శ్రీ మహాలక్ష్మి ఒత్తే శ్రీ మహావిష్ణు పాదమే ఇది.గరుత్మంతునిపై గుఱ్ఱమెక్కినట్టు అధిరో

హించే పాదమిది. (పాము ఇడి పామిడి ఇడి శబ్దం అభావ సూచక వాచకం. పాముల ను లేకుండా చేసేది గరుత్మంతుడు.ఉదాహరణ - ముక్కిడి.  ఈ పామిడి శబ్దం అన్నమయ్యగారి శబ్దాధికార సూచన)పరమమునులకు, యోగులకు ఎన్నో విధాల, ఎన్నెన్నో వరాలిచ్చే నీ శ్రీపాదమే తిరువేంకటగిరిని శాశ్వతానంద లబ్ధి కలదని చూపినది. ఆ శాశ్వతానంద పరమపదమే నీ శ్రీపాదము - అదే పరబ్రహ్మము అని చాటారు అన్నమాచార్యులు. ఈ సంకీర్తనలో 'పాదము' పైన అంత్యాను ప్రాస గమనించదగిన శబ్దాలంకారం. పోతనగారు వామనావతార ఘట్టంలో ఒక పద్యంలో ఇదే శబ్దానుప్రాస వాడారు.

బలి దైతేయ కరాక్షతోత పవిత్రాంభః కణ శ్రేణికిన్
జలజాతాక్షుడు సాచె మౌని సుమనస్సంప్రార్థిత శ్రీదమున్
కలితానవ్రు రమాలలాట పదవీ కస్తూరికా శాదమున్
నలినా మోదము రత్న నూపురిత నానా వేదమున్ పాదమున్ అనీ